సాక్షి కృష్ణాజిల్లా

శనివారం ◆ 19 ◆ అక్టోబర్ ◆ 2024



నిత్యాన్నదానానికి విరాళం


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన సునీల్‌కుమార్, హారిక దంపతులు రూ.1,11,111 విరాళం అందజేశారు.



ముమ్మరంగా ప్రాక్టీస్

మూలపాడులో ఈ నెల 20 నుంచి జరిగే సి.కె. నాయుడు అండర్–23 మల్టీ డే మ్యాచ్ కోసం ఏపీ, మేఘాలయ జట్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నాయి.

–8లో▸



64,312 క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 65,756 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 64,312 క్యూసెక్కులు వదులుతున్నారు.



వినిపించదా.. రైతు గోడు

అన్నదాతకు సాయం కరువు

సాగు చేయడం రైతుకు భారంగా మారుతోంది. పెట్టుబడి కోసం అష్టకష్టాలు పడి వ్యవసాయం చేస్తున్నా పాలకుల చేయూత లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. ఎన్నికల ముందు.. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు రైతును విస్మరిస్తున్నారు. మా సాగు గోడు రాష్ట్ర పాలకులకు వినపడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం కృష్ణా జిల్లాలో రైతుకు అండగా నిలిచి పెట్టుబడి సాయంగా రూ.1,564 కోట్లను అందించింది.





- అందని రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ రెండో విడత నిధులు జమ
- పెట్టుబడి సాయంపై ప్రకటన చేయని రాష్ట్ర పాలకులు

ఎన్నికల ప్రచారంలో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు

గత ప్రభుత్వం ఏక కాలంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా నిధులు జమ

పామర్రు: ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకున్నా రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూపాయి పెట్టుబడి సాయం అందలేదు. కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం రెండు విడతల్లో పీఎం కిసాన్ కింద రూ.4 వేలు అందజేసింది. మరో విడత జనవరిలో రైతుల ఖాతాలకు జమ చేయనుంది. ఎన్నికల ప్రచారంలో రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామంటూ టీడీపీ నేతలు ఊరూవాడా ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు నాలుగు నెలలవుతున్నా రైతులను ఆదుకోవడంలో విఫలమైంది. రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.14 వేలలో తొలివిడతగా కనీసం సగం డబ్బులు ఇచ్చినా రైతన్నకు ఆర్థిక చేయూత అందేదని చెబుతున్నారు.

కేంద్రం మూడు విడతల్లో

పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు మూడు విడతల్లో రూ.6వేల సాయం అందజేస్తామని ప్రకటించింది. జూన్ నెలలో రూ.2 వేలు చొప్పున జిల్లాలోని 1.85 లక్షల మంది రైతులకు రూ.37.08కోట్లు జమ చేసింది. రెండో విడతగా మరో రూ.37.08 కోట్లు జమచేసింది.

అన్నదాతకు కష్టాలు మొదలు

రైతులకు మళ్లీ సాగు కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20వేల పెట్టుబడి సాయంలో రూపాయి కూడా అందజేయలేదు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.4వేలు అందజేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరం.

మళ్లీ పాత రోజులే..

పంట సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం 2019కి ముందు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేసే వారు. పంట చేతికొచ్చాక వడ్డీతో కలిపి అప్పు తీర్చేవారు. అయితే ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపోయేవారు. వడ్డీలు భారమయ్యేవి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలు దూరమయ్యాయి. ఏటా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఠంచన్‌గా రూ.13,500 పెట్టుబడి సాయాన్ని సీజన్ వారీగా అందజేసేది. దీంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం తప్పింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం తీరుతో మళ్లీ పాత రోజులే ఎదురవుతున్నాయంటూ రైతులు వాపోతున్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయామంటూ నిట్టూరుస్తున్నారు.

గత ఐదేళ్లలో రూ.1,564 కోట్లు అందజేత

వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద 2019 నుంచి 2023 వరకు గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెట్టుబడి సాయంగా జిల్లాలోని రైతులకు రూ.1564 కోట్లు అందజేసి అండగా నిలిచింది. ఏటా మే నెలలో ఖరీఫ్ సాగు చేసే ముందు రూ.7,500, అక్టోబర్ నెలలో (పంట కోత,కుప్ప తదితర అవసరాలకు) రూ.4వేలు, జనవరి నెలలో పండించిన ధాన్యం ఇంటికి చేర వేసే సంక్రాంతికి రూ.2వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసింది.

జగన్ ప్రభుత్వం అందజేసిన సాయమిలా..

సంవత్సరం	రైతులు	అందిన సాయం
2019-20	2,01,451	రూ.264.06 కోట్లు
2020-21	2,23,568	రూ.323.14 కోట్లు
2021-22	2,31,438	రూ.332.89 కోట్లు
2022-23	2,41,853	రూ.341.51 కోట్లు
2023-24	2,55,394	రూ.302.57 కోట్లు



● అన్నదాతకు కష్టాలు మొదలు



రైతులకు మళ్లీ సాగు కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20వేల పెట్టుబడి సాయంలో రూపాయి కూడా అందజేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరం. –బి.అప్పిరెడ్డి, రైతు పామర్రు

● మళ్లీ ఇబ్బందులే..



నా రెండు ఎకరాల పొలంలో వరి సాగు చేశాం. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మే నెలలోనే వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద తొలివిడతగా రూ.7,500 బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. పెట్టుబడికి అప్పు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. –మర్రెడ్డి అంజిరెడ్డి, రైతు పామర్రు

న్యూస్‌రీల్

'పోలీస్' దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమల రావు అన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 21న జరిగే కార్యక్రమానికి వీవీఐపీలు, వీఐపీలు వస్తారని ఏర్పాట్లు బాగాచేయాలన్నారు. అనంతరం పోలీస్ పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో ఐజీ శ్రీకాంత్, డీఐజీలు రాజకుమారి, అమ్మిరెడ్డి ఉన్నారు.

డాక్టర్ జీవీ పూర్ణచందుకు 'సరస్వతి సమ్మాన్'



విజయవాడకల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జీవీ పూర్ణచందును సరస్వతి సమ్మాన్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అఖిల భారత భాషా సాహిత్య సమ్మాన్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ పెరుగు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారిని ప్రతి ఏడాది ఎంపిక చేసి పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. 2024 సంవత్సరానికి జీవీ పూర్ణచందును ఎంపిక చేశామని, ఈ నెల 20న నెల్లూరులో జరిగే సభలో పురస్కారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన్ను కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నగరానికి చెందిన సాహితీవేత్తలు డాక్టర్ గోళ్ల నారాయణరావు, బోడి ఆంజనేయరాజు, డాక్టర్ వెన్నా వల్లభ రావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు అభినందించారు.

'ఉల్లాస్ అక్షరాస్యత'పై దృష్టిపెట్టండి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం అమలుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నిధి మీనా ఆదేశించారు. జేసీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ అమలుపై నిధి మీనా.. పాఠశాల విద్య, వయోజన విద్య, డీఆర్‌డీఏ, గ్రామ–వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్, సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయని, లక్ష్యాల సాధనకు అధికారులు కృషిచేయాలని సూచించారు. ఇందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన, మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా కమిటీలు పనిచేస్తాయన్నారు. సమావేశంలో ఉల్లాస్ కార్యక్రమ నోడల్ అధికారి జి.ప్రసాద్‌రావు, ఏపీవో ఎం.సింగయ్య, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీపీఆర్వో ఎస్‌వీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి సమ్మెలోకి వైద్యమిత్రలు



చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలోని ఆరోగ్యశ్రీ సీఈవో లక్ష్మీశాకు సమ్మె నోటీసును శుక్రవారం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కో–ఆర్డినేటర్‌కు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదన్నారు. శనివారం నుంచి 15 రోజుల పాటు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెలోకి వెళతామన్నారు. సీఈవోకు వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ జిల్లా కార్యదర్శి వి.పోతురాజు, డెన్నీపాల్, పుష్పలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పనుల్లో వేగం పెంచండి

చిలకలపూడి(మచిలీపట్నం): నిర్దేశిత సమయానికి మచిలీపట్నం పోర్టును సిద్ధం చేసేందుకు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి, మచిలీపట్నం పోర్టు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు పనులు డిసెంబరు 2025 నాటికి పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మెగా ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్ తులసీదార్, ఏపీ మారిటైం బోర్డు డీఈ ఎం.శివయ్య, ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో మన బడి – మన భవిష్యత్తు పథకం ద్వారా చేపట్టిన పనుల పురోగతి సాధించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. డీఈవో తాహెరాసుల్తానా, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీరాములు నాయక్, జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు మాస్టారుకు ఆంధ్రరత్న అవార్డు



మైలవరం: మైలవరం నియోజకవర్గం జి.కొండూరుకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు గురుబ్రహ్మ అవార్డు గ్రహీత డాక్టర్ పెదగమ్మళ్ల నాగరాజు 2024 సంవత్సరానికి అరుదైన ఆంధ్ర రత్న అవార్డుకు ఎంపికయ్యారు. అఖిల భారత సాంస్కృతిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.విజయకుమార్ నుంచి ఆహ్వానం అందినట్లు నాగరాజు మాస్టారు శుక్రవారం తెలిపారు. తెలుగు సాహిత్య సేవ, చక్కటి తెలుగు విద్యా బోధనతో పాటు వివిధ సామాజిక సేవలు నిర్వహిస్తున్నందుకు అవార్డును ఈ నెల 21న విజయవాడలో అందుకోనున్నారు. ప్రస్తుతం ఆయన గంగినేనిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆయనకు అవార్డు రావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆకస్మిక తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని అయోధ్యానగర్, దుర్గాపురం పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది చక్కని పనితీరు కనపర్చాలని, వైద్యం కోసం వచ్చిన వారికి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం 197వ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమీక్షించారు. ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ఆవశ్యకత వివరించారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగినపూడిలో అలజడి

30 మీటర్లు ముందుకు వచ్చిన అలలు



మంగినపూడి బీచ్‌లో అలజడి రేగింది. శుక్రవారం సాయంత్రం వరకు ప్రశాంతంగా ఉన్న బీచ్‌లో ఒక్కసారిగా అలలు ఎగసిపడటంతో సముద్రం ముందుకువచ్చింది. దీంతో పర్యాటకులు, వ్యాపారులు దూరంగా వెళ్లారు. ఎగసిపడిన అలలతాకిడి సముద్రం సుమారు 30 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. మరి కొద్ది సేపటికి వెనక్కి వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి బీచ్ వద్దకు పంపారు. ఇదిలా ఉండగా పౌర్ణమి రోజున సముద్రం పోటు మీద ఉన్న సమయంలో పెద్ద అలలు రావటం కారణంగా నీరు ముందుకు వస్తుంటుందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. - కోనేరుసెంటర్

చెరకు టన్ను మద్దతు ధర రూ.3,176

ఉయ్యూరు: కేసీపీ యాజమాన్యం 2024–25 సీజన్‌కు చెరకు టన్ను మద్దతు ధర రూ.3,176గా ప్రకటించింది. కర్మాగారంలో చెరకు మద్దతు ధర, సబ్సిడీలపై చెరకు ఉత్పత్తిదారుల సంఘం, రైతులు, కేసీపీ వ్యవసాయ విభాగం అధికారులతో కేసీపీ యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీజన్‌లో కర్మాగారానికి చెరకు తోలే రైతులకు టన్నుకు ఇస్తున్న రూ.400 సబ్సిడీతో కలిపి రూ.3,576 చెల్లిస్తున్నామన్నారు. యాంత్రీకరణతో సాగు చేసిన రైతులకు రూ.500 సబ్సిడీతో కలిపి రూ.3,676అందిస్తున్నామన్నారు. సెప్టెంబరులో వరదలకు నష్టపోయిన రైతులకు రూ. 40.89 లక్షలు పరిహారంగా అందిస్తున్నామన్నారు.

నవంబర్ 15 నుంచి పిల్లల పండుగ

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నవంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు పేర్కొన్నారు. రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం 'పిల్లల పండుగ' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి, సర్వతోముఖాభివృద్ధికి అమరావతి బాలోత్సవం 2017 నుంచి పిల్లల పండుగను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సారి ఒక థీమ్‌ను ఎంపిక చేసుకొని ఆ అంశంపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ప్రగతికి మార్గం–సైన్స్ విజ్ఞానం అనే అంశం థీమ్‌గా పండుగ నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మూడు విభాగాలుగా 43 అకడమిక్, 18 కల్చరల్ అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. మూడు రోజులు జరిగే పిల్లల పండుగలో 200 స్కూళ్ల నుంచి 10 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లోని 500 స్కూళ్లకు బ్రోచర్స్ అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో బాలోత్సవం గౌరవాధ్యక్షుడు చలవాది మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, ఆఫీస్ బేరర్స్ గుమ్మా సాంబశివరావు, ఎస్.విద్యాకన్నా, వై.సుబ్బారావు, నరసింహారావు, జి.రవీంద్ర, పి.ఐజాక్, యు.వి.రామరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా భద్రతా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. తొలుత జిల్లా రవాణాధికారి జి.మనీష పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ ఏడాది 569 ప్రమాదాలు జరగ్గా అందులో 242 మంది మరణించారని, 541 మందికి గాయాలయ్యాయన్నారు. నెలకు సరాసరి 26 మంది చనిపోయారన్నారు. జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా జరిగిన ప్రమాదాలతో 61 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని వివరించారు. వీటిలో ఎన్‌హెచ్ 65లో మచిలీపట్నం – విజయవాడ రహదారిలో 30 బ్లాక్ స్పాట్‌లు, పెనమలూరులో 11 ఉన్నాయని తెలిపారు. ఎన్‌హెచ్ 16లో 20 బ్లాక్ స్పాట్‌లు గుర్తించామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అత్యధికంగా 129 ప్రమాదాలు జరిగాయన్నారు. ఆ సమయంలో ఎందుకు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆ సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని, పెనమలూరు, కానూరులో అండర్‌పాస్, సిగ్నల్ సిస్టమ్ లేకపోవడంతో ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, జాతీయ రహదారి పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రజారవాణాధికారి శ్రీవాణి, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, డీసీహెచ్‌ఎస్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి

కోనేరుసెంటర్: దేశం అభివృద్ధి చెందాలంటే విద్య, ఎంటర్ ప్రెన్యూర్స్ చాలా ముఖ్యమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ ఔట్రీచ్ కార్యక్రమాన్ని శుక్రవారం బందరు మండలం పోతేపల్లిలోని ఇమిటేషన్ జ్యువెలరీ పార్కులో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంటర్‌ప్రెన్యూర్స్ తలుచుకుంటే దేశం తలరాత మార్చగలరన్నారు. సిడ్బీ జనరల్ మేనేజర్ వి.చంద్రమౌళి, పోతేపల్లి ఇమిటేషన్ జ్యువెలరీ ప్యార్క్ అధ్యక్షుడు పీవీ సుబ్బారావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం వెంకట్రావు, ఇమిటేషన్ జ్యువెలరీ ఎస్‌పీవీ క్లస్టర్ డైరెక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ భూమిలో మద్యం దుకాణం ఏర్పాటు



నందిగామటౌన్: పట్టణంలోని పాతబస్టాండ్‌లోని శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి చెందిన స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఆలయ ఈఓ గంగాధర్ శుక్రవారం దుకాణం వద్దకు వెళ్లి అందుకు సంబంధించిన రికార్డులను చూపారు. అదే విధంగా దేవదాయ శాఖ నిబంధనలు, ప్రొహిబిషన్ ఎక్సైజ్ చట్టం ప్రకారం ఆలయ స్థలాలు, ఆలయాలు, పాఠశాలల పరిసర ప్రాంతాలలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆలయ అధికారులకు మద్యం దుకాణం నిర్వాహకులకు మధ్యం స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో స్థలం ఆలయానికి చెందినదిగా లేదని మద్యం దుకాణం నిర్వాహకులు చెబుతున్నారు.

ఏఐలో నిరంతర అభివృద్ధి



గుడ్లవల్లేరు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లో నిరంతర అభివృద్ధి కొనసాగుతుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా) ఏపీ చైర్మన్ డాక్టర్ చింతమనేని వెంకట శ్రీరామ్ తెలిపారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ విభాగం, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా) వారు సంయుక్తంగా శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు త్రూ అడ్వాన్స్ ఏఐ అండ్ ఎంఎల్ టెక్నాలజీస్ అనే అంశంపై నిర్వహించే ఫ్యాకల్టీ డెవలమెంట్ కార్యక్రమానికి వెంకట శ్రీరామ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. భవిష్యత్తులో మనిషి ప్రమేయం లేకుండానే ఏఐ అండ్ ఎంఎల్ సాంకేతికతతో యంత్రాల సహాయంతో ప్రపంచం ముందడుగు వేస్తుందని ఐఎస్ఈ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎల్.ఎస్.దేవి కుమార్ అన్నారు. ఐఈఐ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈఎఫ్‌డీపీ అధ్యాపకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. అనంతరం అతిథులకు కాలేజీ యాజమాన్యం జ్ఞాపికలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో మాఫియా రాజ్యం

- ఇక్కడ చట్టాలతో పనిలేదు
- చెలరేగిపోతున్న ఇసుక మాఫియా
- నిషేధ క్వారీలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- శాంతిభద్రతలు కరువు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మాఫియా రాజ్యమేలుతోంది. ఇక్కడ చట్టాలు, ప్రభుత్వ నిబంధనలు అమలు కావటం లేదు. గ్రామ పరిధిలో ఉన్న ఇసుక క్వారీలో చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వం తవ్వకాలపై నిషేధం విధించినా ఇసుక మాఫియా చెలరేగిపోతుంది. టన్నుల కొద్ది ఇసుక అక్రమంగా తవ్వి కాసులు సంపాదిస్తున్నారు. ఇక్కడ ఇంత తంతు జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవటంపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



యనమలకుదురులోని ఇసుక గుట్ట

గత ప్రభుత్వంలో అక్రమాలకు చెక్

వివరాల్లోకి వెళితే యనమలకుదురు విజయవాడ నగరానికి కూతవేటు దూరంలో ఉంది. గ్రామంలో ఉన్న ఇసుక క్వారీ కనకదుర్గ వారధికి సమీపంలో ఉండటంతో ఇసుక తవ్వకాలు చేయరాదని గత దశాబ్ద కాలం క్రితం ప్రభుత్వం క్వారీపై నిషేధం విధించింది. గతంలో ఇక్కడ ఇసుక మాఫియాపై పోలీసులు షీట్లు తెరిచి అక్రమ ఇసుక తవ్వకాలకు చెక్ పెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరలా ఇసుక మాఫియా చెలరేగిపోతున్నారు.

వారధిని కాపాడేదెవరు..

కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు చేస్తే కనకదుర్గ వారధికి ప్రమాదం ఉంటుందని రామలింగేశ్వరనగర్, యనమలకుదురు ఇసుక క్వారీలను నిషేధించారు. దీంతో యనమలకుదురు ఇసుక క్వారీ శాశ్వతంగా మూసివేశారు. అయితే ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేతల అండదండలతో ఇసుక మాఫియా రంగంలోకి దిగారు. నిషేధ క్వారీలో రాత్రి సమయంలో దాదాపు 40 ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి బ్లాక్ మార్కెట్‌లో ఇసుక అమ్ముతున్నారు. టన్నుల కొద్ది ఇసుక తరలి పోవటంతో కనకదుర్గ వారధి ప్రమాదంలో ఉందని నిపుణులు తెలుపుతున్నారు. ఇక్కడ మాఫియా రాజ్యమేలుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు

యనమలకుదురులో ఇసుక మాఫియా కారణంగా గ్రామంలో శాంతి భద్రతల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఇసుకకు ఫుల్ డిమాండ్ ఉండటంతో మాఫియా జేబులు నింపుకుంటుంది. రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులు గ్రామంలో మ ద్యం, గంజాయి సేవించి సంచరిస్తూ ప్రజలకు హడలెత్తిస్తున్నారు. గ్రామస్తులు ఎవరైనా అక్ర మంగా ఇసుక తరలించే ట్రాక్టర్‌ను ఆపితే వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలు చేజారక ముందే జిల్లా అధికారులు వెంటనే మాఫియాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్యాంకర్లు ఉదారంగా రుణాలు ఇవ్వండి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో పాటు విద్య, గృహ నిర్మాణ రంగాలకు బ్యాంకర్లు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బ్యాంకర్లతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వరద ప్రభావిత జిల్లాగా కృష్ణా జిల్లా ఉన్నందున రుణాలు మరో ఏడాది పాటు రీస్ట్రక్చరింగ్ చేయాలన్న ఆర్‌బీఐ సర్క్యులర్ నిబంధనను అన్ని బ్యాంకులు అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టిడ్కో, ఆక్వా రుణాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం జయవర్ధన్, ఆర్‌బీఐ మేనేజర్ ఎంకె.సునీల్, ఇండియన్, యూనియన్ బ్యాంక్ అధికారులు ఎం.రాజేష్, తాతాజీ, జిల్లా వ్యవసాయ, పరిశ్రమల శాఖాధికారులు ఎం.పద్మావతి, ఆర్.వెంకట్రావు, టిడ్కో పీడీ చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు కృష్ణా అనుకూలం..

పారిశ్రామికవేత్తలకు కృష్ణాజిల్లా అనుకూలమైన ప్రాంతమని పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పారిశ్రామికవాడలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సింగిల్ విండో పద్ధతిపై పరిశ్రమల ఏర్పాటు, రాయితీలు కల్పించాలన్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో మంజూరు చేసిన యూనిట్లు, వాటి స్థితిగతులపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా అర్హులైన 10 మంది లబ్ధిదారులకు కలెక్టర్ బాలాజీ రుణ మంజూరు పత్రాలను అందజేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఆర్.వెంకట్రావు, ఎల్‌డీఎం జయవర్ధన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, బీపీఓ జె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాక్టర్లలోకి చెత్తను ఎక్కిస్తున్న కార్మికులు



జటిలమవుతున్న చెత్త సమస్య

మచిలీపట్నంటౌన్: నగరంలో చెత్త సమస్య నానాటికి జటిలమవుతోంది. 41 డివిజన్లలో ప్రతి రోజు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే వాహనాలు ఆయిల్ లేకపోవటంతో మూలనపడ్డాయి. దీంతో ఆయా డివిజన్లలో చెత్త పేరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించటంతో పాటు రోడ్లను శుభ్రం చేయగా వచ్చిన చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయి. దీంతో ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. నగరంలోని 50 డివిజన్లలో 41 డివిజన్లలో వాహనాలు, మిగతా డివిజన్లలో 10 ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించేవారు. క్లాప్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలోని చెత్తను తరలించేందుకు 41 వాహనాలను గత ప్రభుత్వం కేటాయించింది. వీటి నిర్వహణ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చూసుకునేది. డ్రైవర్ జీతం, ఆయిల్, నిర్వహణ వంటి ఖర్చులకు ప్రభుత్వం నిధులు కేటాయించి విడుదల చేసేది. దీంతో ఈ వాహనాలు సజావుగా పనిచేసేవి అయితే కూటమి ప్రభుత్వం గత వారం రోజులుగా వాహనాలకు ఆయిల్ పోసేందుకు నిధులు విడుదల చేయటం లేదు. అలాగే డ్రైవర్లకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదు. దీంతో వాహనాలు మూలనపడ్డాయి. డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కార్మికులపై అదనపు భారం

నగరంలో చెత్తను సేకరించే వాహనాలు మూలనపడటంతో పారిశుద్ధ్య కార్మికులపై అదనపు భారం పడింది. ఆయా డివిజన్లలో చెత్తను సేకరించటం, రోడ్లు శుభ్రం చేయడం, డ్రెయిన్లలో పూడికతీయటం వంటి పనులు చేయటంతోనే పనిభారంతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు సేకరించిన చెత్తను ట్రాక్టర్లపై ఎక్కించటం భారంగా మారుతోంది. చెత్త తరలింపు వాహనాలు ఉంటే ఒక్కొక్క వాహనానికి ఒక కార్మికుడు ఉండి చెత్తను లోడు చేసుకునే వారు ప్రస్తుతం ఆయా డివిజన్లలోని కార్మికులే ఈ పనులు చేస్తుండటంతో వారిపై భారం పడుతోంది.

10 మున్సిపల్ ట్రాక్టర్లతోనే చెత్త తరలింపు

నగరంలో ఉన్న 50 డివిజన్లలో ప్రతి రోజు వస్తున్న చెత్తను 10 ట్రాక్టర్లు, మూడు కంపాక్టర్లతో చెత్తను సేకరించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే డివిజన్‌లో పేరుకుపోతున్న చెత్తను పూర్తిస్థాయిలో డంపింగ్‌యార్డుకు చేరవేయలేకపోతున్నారు. గతంలో ఒక్క డివిజన్‌లో పనిచేసిన ట్రాక్టర్ ప్రస్తుతం మూడు డివిజన్లలో చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్నారు.

ముమ్మరంగా ఆంధ్రా, మేఘాలయ జట్ల ప్రాక్టీస్

విజయవాడస్పోర్ట్స్: బీసీసీఐ కల్నల్ సి.కె.నాయుడు అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లో తలపడేందుకు ఆంధ్రప్రదేశ్, మేఘాలయ జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు మూలపాడులోని ఏసీఏ మైదానాల్లో ఈ జట్లు తలపడనున్నాయి. ఈ నెల 17వ తేదీ సాయంత్రం క్రీడా ప్రాంగణానికి చేరుకున్న జట్లు శుక్రవారం ఉదయం నుంచి ప్రాక్టీస్‌లో తలమునకలయ్యాయి. ప్రాక్టీస్ చేసుకునేందుకు అనువుగా ఇరు జట్లకు ఏసీఏ నెట్‌లను కేటాయించింది. ఆంధ్రా జట్టుకు రేవంత్‌రెడ్డి(కెప్టెన్), హర్షవర్ధన్, శశాంత్‌శ్రీవత్స, నిఖిలేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటరాహుల్, ధరణికుమార్‌నాయుడు, తేజ, రవికిరణ్, సుమిత్, సాకేత్‌రామ్, భార్గవ్, ఇస్మాయిల్, శ్రీకర్‌సాయిరెడ్డి, వాసు, విజయ్, మేఘాలయ జట్టుకు క్రిస్టోఫర్, మనీష్‌శర్మ, అమన్‌కుమార్, అవినాష్, మారప్పా, అభిషేక్‌కుమార్, గుల్‌గుల్‌సంగ్మా, బిపిన్‌రాయ్, మోమిన్, జాయ్‌దీపన్, నవీన్‌కుమార్, పూరవ్ అగర్వాల్, సంతోష్, సచిన్‌కుమార్, స్వస్తిక్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ప్రకటించింది.



ప్రాక్టీస్ చేస్తున్న మేఘాలయ జట్టు

ఆలయాల పరిరక్షణ హిందువుల బాధ్యత

అవనిగడ్డ: దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్క హిందువు బాధ్యతగా తీసుకోవాలని వీహెచ్‌పీ న్యూఢిల్లీ కేంద్రీయ సమరసత కార్యదర్శి దేవ్ భాయ్ రావత్ అన్నారు. లక్ష్మీనారాయణస్వామి(గాలిగోపురం) ప్రాంగణంలో శుక్రవారం హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం హిందువులంతా ఐక్యంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మత మార్పిడి నిరోధానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూర్పు వీహెచ్‌పీ విభాగ ప్రాంత ఉపాధ్యక్షుడు పల్నాటి వెంకటస్వామి నాయుడు, జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్, రఘుశేఖరప్రసాద్, బసవ శంకరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం.. వ్యక్తి మృతి



అశోక్(30)

జగ్గయ్యపేట: 65వ నంబర్ జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గరికపాడు చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన యలమర్తి అశోక్(30) కూలీ పనులు చేస్తుంటాడు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో తన అత్త గారింట్లో ఉన్న భార్యను చూసేందుకు గురువారం రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. చెక్‌పోస్టు సమీపంలోని కేవీకే వద్దకు వచ్చే సరికి రహదారి మరమ్మతులు చేపడుతుండటంతో వన్‌వే ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయి. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం అతడిని ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని భార్య ఎస్తేరు రాణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

900 గ్రాముల గంజాయి, బైక్‌ల స్వాధీనం



తిరువూరు: తిరువూరులో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ముగ్గురు నేరస్తులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తిరువూరు మండలం లక్ష్మీపురానికి చెందిన మద్దిరాల లోకేష్‌తో పాటు మరో ఇద్దరు మైనర్ బాలురు గత నెల రోజులుగా దొంగిలించిన ఏడు ద్విచక్ర వాహనాలతో పాటు 900 గ్రాముల గంజాయిని పోలీసులు వీరి నుంచి స్వాధీనపరచుకున్నారు. ఏసీపీ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం తిరువూరులోని శాంతినగర్, బైపాస్‌రోడ్డు, జైబావి సెంటర్, మధిర రోడ్డు, చీరాల సెంటర్, గుళ్లపల్లి ఎన్‌క్లేవ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను నిందితులు దొంగిలించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.4.80 లక్షలుంటుందని తెలిపారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. నిందితులను పట్టుకున్న సీఐ గిరిబాబు, ఎస్ఐ సత్యనారాయణ, వెంకటరావులను ఏసీపీ అభినందించారు.

డ్వాక్రా సొమ్ము దోచేసిన దొంగలు

పెనమలూరు: డ్వాక్రా సంఘం సొమ్ము బ్యాంకులో డిపాజిట్ చేయటానికి వెళ్తున్న సభ్యురాలి చేతిలోని సొమ్మును గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఎత్తుకెళ్లిన ఘటన యనమలకుదురులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన డ్వాక్రా సభ్యురాలు తడకుదురు మీనా(29) శుక్రవారం తమ గ్రూప్ పొదుపు చేసిన రూ.61 వేలను గ్రామంలోని బ్యాంక్‌లో జమ చేయటానికి బయలుదేరింది. ఆమె చేతిలో ఉన్న నగదును గమనించిన గుర్తు తెలియని దొంగలు ఆమెను వెంబడించారు. గ్రామంలోని సాయినగర్ మొదటి లైన్ వద్దకు మీనా రాగానే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు మీనా చేతిలో ఉన్న నగదును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందటంతో సీఐ వెంకటరమణ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు.

నేడు స్వర్ణభారత్‌లో మెగా వైద్యశిబిరం

ఉంగుటూరు: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, అకిరా కంటి ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరాన్ని శనివారం ఉదయం 8 గంటలకు మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. శిబిరంలో గుండె, మెదడు, ఎముకలు, ఊపిరితిత్తులు, రుమటాలజీ(కండరాలు, కీళ్లవాపులు), సాధారణ వ్యాధుల నిపుణులచే పరీక్షలు చేసి సలహాలు ఇస్తారన్నారు. అకిరా కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. షుగర్, బీపీ, ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. వివరాలకు 95050 12312 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు రైతు నేస్తం పురస్కారాలు..

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 20న పద్మశ్రీ డాక్టర్ ఐ.వి.సుబ్బారావు రైతునేస్తం పురస్కారాలు-2024 అందజేయనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశీ తెలిపారు. రైతు నేస్తం 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ ఐ.వి.సుబ్బారావు పేరిట వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలు అందజేసి, ఘనంగా సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు.

కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు

తోట్లవల్లూరు: కృష్ణానదిలో స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు గల్లంతైన ఘటన మండల కేంద్రమైన తోట్లవల్లూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోటకు చెందిన సెప్టిక్‌ట్యాంక్ బృందం తమ వాహనంతో తోట్లవల్లూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఇటీవల పనులకు వచ్చింది. ఉయ్యూరుకు చెందిన జగన్నాథం మూర్తి(35) వీరితో కలిసి పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో స్థానిక కృష్ణానది పాయలో మూర్తి మద్యం మత్తులో స్నానానికి దిగాడు. స్నానానికి దిగే క్రమంలోనే గుండంలోకి వెళ్లి మునిగిపోయి గల్లంతయ్యాడు. సమీపంలో ఉన్న మత్స్యకారులు మూర్తిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అతని జాడ లభించలేదు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం.అర్జునరాజు హుటాహుటిన కృష్ణానది పాయ వద్దకు వెళ్లి మత్స్యకారులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ మూర్తి ఆచూకీ లభించకపోవటంతో శనివారం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు జరపనున్నట్లు ఆయన తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని తహసీల్దార్ కుసుమకుమారి, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు సందర్శించి వివరాలు సేకరించారు.

విరబూసిన బ్రహ్మకమలం

స్థానిక విజయవాడ రోడ్డులోని కాకర్ల కృష్ణదాసు పుష్పావతి దంపతుల గృహంలోని బ్రహ్మకమలం వృక్షం శుక్రవారం రెండు పువ్వులను పూసింది. ఈ వృక్షానికి ఎలాంటి రసాయన ఎరువులు వేయలేదని, ప్రకృతి సిద్ధమైన ఎరువులను మాత్రమే వేశామని కృష్ణదాసు తెలిపారు. ఎంతో అరుదుగా పూసే బ్రహ్మకమలం పుష్పాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబర్చారు.

– పామర్రు

